క్లుప్తంగా

పేద కుటుంబానికి సరుకులు అందజేత

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన అనుప లక్ష్మి–రాము అనే పేద కుటుంబసభ్యులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలిసి పట్టణానికే చెందిన వోకేఆర్ ఫౌండేషన్ నిర్వాహకుడు ఒడ్డెపల్లి కృష్ణంరాజు బాధిత కుటుంబానికి చేయూతనిచ్చాడు. సోమవారం వోకేఆర్ మిత్ర బృందం మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. వారికి వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్‌లో గాల శ్రీనల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ హాజరై అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారి తీర్థప్రసాదం అందజేశారు. స్థానిక కౌన్సిలర్ కత్తి నరేందర్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కుంటాల: మండలంలోని విఠాపూర్ గ్రామంలో సోమవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను మాజీ ఎంపీపీ రమణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మిరమేశ్, వీడీసీ చైర్మన్ అశోక్, మాజీ ఉపసర్పంచ్ నవీన్‌రెడ్డి, హెచ్‌ఎం భీమన్న, డాక్టర్ భోజన్న, లింగురాం పటేల్, సాయినాథ్, బిట్టు పాల్గొన్నారు.

డీఎల్‌పీవో తనిఖీ



బుట్టాపూర్‌లో పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమేశ్

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్, రేవోజీపేట గ్రామపంచాయతీలను సోమవారం డీఎల్‌పీవో రమేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పంచాయతీ రికార్డులతోపాటు నర్సరీలు, డంపింగ్‌యార్డులను పరిశీలించారు. నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు మల్లేశ్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. సోమవారం మండలంలోని మాచాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా మల్లేశ్, ఉపాధ్యక్షునిగా ముత్యం, ప్రధాన కార్యదర్శిగా రజనీకాంత్, పార్‌పెల్లిలో గ్రామ అధ్యక్షుడిగా వల్ల కొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సోమన్న, ప్రధాన కార్యదర్శిగా గబ్బర్‌సింగ్, రాచాపూర్‌లో గ్రామ అధ్యక్షుడిగా, బెన్నెబోయిన పోశెట్టి, ఉపాధ్యక్షుడిగా ముత్యం, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కనకాపూర్‌లో గ్రామ అధ్యక్షుడిగా నైనం రాకేశ్, ఉపాధ్యక్షుడిగా రేణి రఘు, ప్రధాన కార్యదర్శిగా నవీన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్, శేఖర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నగేశ్ తదితరులు ఉన్నారు.

పుట్టధని, గంగస్నానం



ఆలయానికి వెళ్తున్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని గోదావరి తీరంలో ఉన్న ఎల్లమ్మ ఆలయం వద్ద వార్షిక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ఎల్లమ్మ ఉత్సవమూర్తి విగ్రహాలకు గంగాజలంతో అభిషేకం, పుట్టధని కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు బిందెలతో ఊరేగింపుగా గోదావరికి వచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఒల్లాల చిన్న నర్సాగౌడ్, అమరవేణి శంకర్‌గౌడ్, బుర్ర రాజారాంగౌడ్, వెంకాగౌడ్, తదితరులు ఉన్నారు.

మహిళలకు రుణాల పంపిణీలో దిలావర్‌పూర్ టాప్

దిలావర్‌పూర్: స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాల పంపిణీలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో దిలావర్‌పూర్ మండలం జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచింది. డీఆర్డీవో విజయలక్ష్మి సోమవారం మండల ఏపీఎం సులోచన, సీసీలు పోశెట్టి, కోడె ముత్యం, ఎస్.ముత్యంతోపాటు గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులకు, మండల సమాఖ్యకు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ గడిచిన ఆర్థిక సంవత్సరంలో బాంకులింకేజీ ద్వారా 170 శాతం, స్త్రీనిధి ద్వారా 108 శాతం రుణాలను సభ్యులకు అందించినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు రుణాలు పొంది చిన్నతరహా కుటీర పరిశ్రమలు, కిరాణ దుకాణాలు, కట్టుమిషన్, అల్లికలు, గానుగ యంత్రాలు, ఫ్లోర్ మిల్లులు, అగరుబత్తుల తయారీ కేంద్రాల ను ఏర్పాటు చేసుకొని రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

నాడు ముగ్గురు.. నేడు 62 మంది

పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ఆలోచనకు గ్రామస్తులు, యువజన సంఘాల నాయకుల కృషి తోడవడంతో ఈ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది. అన్ని సౌకర్యాలు కల్పించి మూతపడే స్థితిలో ఉన్న సర్కారుబడిని ఉన్నతంగా తీర్చిదిద్దారు. నాలుగేళ్ల కిందట(2019–20) బడిలో ముగ్గురు విద్యార్థులుండగా ప్రస్తుతం వారి సంఖ్య 62కు చేరింది. దీంతో ఆ ఊరి ప్రజలు తమ పిల్లలను ఈ సర్కారు బడిలోనే చేర్పిస్తున్నారు. కార్పొరేట్‌కు ధీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్న ఈ ప్రాథమిక పాఠశాల ఎక్కడ ఉందో తెలుసా లోకేశ్వరం మండలంలోని సేవాలాల్ తండాలో. – లోకేశ్వరం



ఆంగ్లంలో పాఠాలు బోధిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్

- ఆదర్శంగా సేవాలాల్ తండా ప్రాథమిక పాఠశాల
- తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన
- సర్కారుబడికి చేయూతనిస్తున్న వీడీసీ, యువజన సంఘాల నాయకులు

లోకేశ్వరం మండలం సేవాలాల్‌తండాలో 1988లో ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసింది. గతంలో విద్యార్థులతో కిటకిటలాడిన పాఠశాల 2019–2020లో ముగ్గురు విద్యార్థులకే పరిమితమైంది. దీంతో సరిపడ విద్యార్థులు లేరనే కారణంతో ఇక్కడ పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఎల్మల ప్రవీణ్‌కుమార్‌ను మండలంలోని మరో పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. ఇలాగే కొనసాగితే పాఠశాల మూతపడుతుందని భావించిన సదరు ప్రధానోపాధ్యాయుడు.. ఎంఈవో చంద్రకాంత్ సహకారంతో ఈ బడిలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టారు. రెండు, మూడు దఫాలుగా ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థుల సంఖ్య అదే ఏడాది చివరకు 32 మందికి చేరింది. ప్రస్తుతం 62 మంది చదువుతున్నారు. హెచ్‌ఎంగా ప్రవీణ్‌కుమార్ ఉపాధ్యాయురాలుగా విష్ణు ప్రియాంక పని చేస్తున్నారు.



ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులు

లంబాడా భాష నేర్చుకొని బోధిస్తున్న హెచ్‌ఎం..

పాఠశాలకు వచ్చే విద్యార్థులకు తెలుగు రాకపోవడాన్ని గ్రహించిన హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్ తానే లంబాడా భాష నేర్చుకొని విద్యార్థులకు అర్థమయ్యేలా సులువుగా పాఠాలు బోధించారు. తర్వాత క్రమక్రమంగా విద్యార్థులను లంబాడా భాష నుంచి తెలుగుకు మళ్లించారు. ఒకటో తరగతి విద్యార్థులకు మాతృభాష లంబాడాలోనే పాఠాలు బోధిస్తున్నారు. తెలుగు, ఇంగ్లిష్‌లో మాట్లాడటం నేర్పిస్తున్నారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులు ఇంగ్లిష్‌లో సులభంగా రాస్తూ చదువుతున్నారు.

తరగతుల వారీగా..

ప్రస్తుతం ఒకటో తరగతిలో 10 మంది, రెండో తరగతిలో 17 మంది, మూడో తరగతిలో 14మంది, నాలుగో తరగతిలో 10 మంది, ఐదో తరగతిలో 11 మంది విద్యార్థులు చదువుతున్నారు.

కంప్యూటర్ విద్య..



కంప్యూటర్ నేర్చుకుంటున్న విద్యార్థులు

పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ విద్య బోధిస్తున్నారు. ప్రాథమిక అంశాలపై పట్టు సాధించేలా అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఆలస్యంగా వచ్చినా, గైర్హాజరైన అందులో ఉపాధ్యాయులు పోస్టు చేస్తున్నారు. దీంతో ఆలస్యంగా వచ్చేవారు, గైర్హాజరయ్యేవారు తగ్గుతున్నారు.

చేయూతనిస్తున్న దాతలు..

పాఠశాలకు వీడీసీతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, యువజన సంఘాల నేతలు సహకారం అందిస్తున్నారు. దాతలు పాఠశాలకు టీవీ, ఆరు కుర్చీలు, నాలుగు ఫ్యాన్లను విరాళంగా అందించారు. విద్యార్థులతో విహారయాత్రలు, క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెరిగేలా పాఠశాలలో నమూనా ఎన్నికలు నిర్వహించి బాలల మంత్రి మండలిలను ఏర్పాటు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు యోగా సాధనతో పాటు అబకాస్, వేదగణితం బోధిస్తున్నారు. పోషకుల సహకారంతో టై, గుర్తింపుకార్డులు, బెల్టులు అందించారు.

చదువుతోపాటే ఆటలు



ఉపాధ్యాయులు చదువుతోపాటు ఆటలు ఆడేలా మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. పరిశుభ్రత, క్రమశిక్షణతోపాటు చదువుకుంటే కలిగే ప్రయోజనాలను వివరిస్తుంటారు. వారు చెప్పే పాఠాలు సులభంగా అర్థమవడంతో విజ్ఞానం పెంచుకుంటున్నాం. – జాదవ్ విపుల్, ఐదోతరగతి

పుస్తక పఠనంతో అవగాహన



మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తూ వారు చేసిన పోరాటం, త్యాగాలు ఉపాధ్యాయులు వివరిస్తుంటారు. మాతో పుస్తక పఠనం చేయిస్తుండటంతో అన్ని అంశాలపై అవగాహన కల్గుతుంది. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు సైతం నాటిస్తున్నారు. – ఆడే పాయల్, 4వ తరగతి

అందరి సహకారంతోనే

పాఠశాల అభివృద్ధికి పోషకులు, వీడీసీ, యువజన సంఘాల నాయకులు అందిస్తున్న సహకారం మరువలేనిది. వారి సాయంతోనే విద్యార్థుల సంఖ్య పెరిగింది. మాకు కూడా సంతోషంగా ఉంది. ఆటపాటలతోపాటు విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తున్నాం. ప్రణాళికతో ప్రయోగ పద్ధతిలో పాఠాలు బోధిస్తున్నాం. – ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఎం

భూమిపూజ

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ ఆలయ ఆవరణలో కోనేరు నిర్మాణానికి అల్లాల వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం ప్రత్యేక అధికారి ఉదయ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, అశోక్, భూమారెడ్డి తదితరులు ఉన్నారు.

'నవోదయ'కు ఎంపిక

నర్సాపూర్(జి): ఆరోతరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశపరీక్ష ఫలితాలు ఆదివారం వెలువడ్డాయి. మండల కేంద్రంలోని శ్రీ గాయత్రి కోచింగ్ సెంటర్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు వాసుదేవ్, హరిప్రసాద్, సాయిప్రణవ్, అశ్వంత్, శశాంక్, రామకృష్ణ అర్హత సాధించి నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ గణేశ్, ఉపాధ్యాయులు గజేందర్, వెంకటేశ్, రఘు అభినందించారు.

రైతువిగ్రహం ఆవిష్కరణ



రైతు విగ్రహం ఆవిష్కరిస్తున్న రమేశ్

కుంటాల: మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం తాలూకా కన్వీనర్ రోళ్ల రమేశ్ పేర్కొన్నారు. సోమవారం కుంటాల మున్నూరు కాపు సంఘ భవనంలో రైతు విగ్రహం ఆవిష్కరించి మాట్లాడారు. సంఘటితమై ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగి సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విగ్రహదాత కొత్త కాపు గంగన్న, జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, మండల కన్వీనర్ గోవింద్‌రాజు, అధ్యక్షుడు తోట రాఘవేందర్, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, లక్ష్మణ్, మహేందర్, వివేకానంద్, గణపతి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ముథోల్: మండలకేంద్రంలో సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ సీఈవో సాయారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటను దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాల్ రూ.2203, బీ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2183 మద్దతు ధర అందించనున్నట్లు పేర్కొన్నారు. ఏఈవో రవి, పలువురు రైతులు పాల్గొన్నారు.

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని పెద్దహనుమాన్ మందిరం ఆవరణలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వాహకుడు రమేశ్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా మేనేజర్ ప్రమోద్, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి సాయి సూర్య, గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, సంతోష్, ఏఈఓలు భాగ్యలక్ష్మి, రమ్య పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో బన్సపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. సీఈవో సుకుమార్, ఏఈవో శ్రీ దేవి, రైతులు సుభాశ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సాయినాథ్, ముత్యం, సిబ్బంది రాజశేఖర్, రాజు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పీచరలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో, మండల కేంద్రంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కేంద్రాలను వ్యవసాయశాఖ అధికారులు ప్రారంభించారు. ఏవో ప్రవీణ్‌కుమార్, ఏఈవోలు పవిత్ర, ఉమామహేశ్వరి, సంతోష్, పీఏసీఎస్ సిబ్బంది ఉదయ్, డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు రాజు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. ధాన్యం తీసుకొచ్చే రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంక్ ఖాతా నంబర్ జిరాక్స్‌లు వెంట తెచ్చుకోవాలన్నారు. 17శాతం లోపు తేమ ఉన్న ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి ఆసం రవి, మార్కెట్ కమిటీ సెక్రెటరీ అజామ్ అలీ, పీఏసీఎస్ సీఈవో ఆశన్న, అధికారులు, సిబ్బంది ఉన్నారు.



ముథోల్‌లో కొనుగోలు కేంద్రం వద్ద రైతులు

లోకేశ్వరం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పంటను విక్రయించాలని మండల వ్యవసాయాధికారి గణేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. గన్నీ బ్యాగులు, లారీల కొరత లేకుండా చూస్తామన్నారు. 17 తేమ శాతం ఉన్న పంటనే కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి హన్మాండ్లు, పీఏసీఎస్ సీఈవో చిన్నయ్య, పర్యవేక్షణ అధికారి విజయ్, ఏఈవోలు మౌనిక, భూమేశ్ ఉన్నారు.

పెంబి: మండలంలోని నాగాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీవో విజయలక్ష్మి ప్రారంభించారు. డీఆర్డీవో మాట్లాడుతూ గ్రామాల్లో దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని రైతులకు సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఎం రాజేశ్వర్, ఏపీఎం గంగారెడ్డి, ఏపీవో రాజశేఖర్, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.



నర్సాపూర్(జి): కేంద్రం వద్ద అధికారులు



ఖానాపూర్‌లో ప్రారంభిస్తున్న అధికారులు



లక్ష్మణచాంద: పీచరలో కేంద్రం వద్ద అధికారులు

బీఆర్‌ఎస్‌ది మొసలికన్నీరు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏనాడూ రైతుల సమస్యలను పట్టించుకోలేదని.. కానీ నేడు అధికారం పోగానే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో మాట్లాడారు. రైతు సమస్యలపై ప్రతిపక్షాలు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కులను సైతం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాలరాసిందన్నారు. సాగు, తాగునీటి సమస్య తలెత్తకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వందరోజుల్లో అమలు చేసిన ఏకైక ప్రభుత్వంగా కాంగ్రెస్ చరిత్రలో నిలుస్తుందన్నారు. ఎలాంటి సమస్యలున్నా నేరుగా సంప్రదించాలని ప్రజలకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు.



ఎర్వచింతల్‌లో కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే

ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దర్శనాల వెంకటేశ్, సుతారి రాజేశ్వర్, బల్గం భీమన్న, ప్రేమ్, నడిపి నర్సయ్య, రాంటెంకి రాజన్న తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే తర్లపాడ్ అగ్గిమల్లన్న ఆలయ ఉత్సవాల్లో, మస్కాపూర్ నిస్సి పాఠశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, దయానంద్, రమేశ్, విద్యలత, గంగనర్సయ్య, గంగాధర్, శంకర్, బిక్కు నాయక్, నరేశ్, రవీందర్, ఫకిర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యక్ష పదవిపై వీగిన అవిశ్వాసం

- సారంగపూర్‌లో హాజరు కాని ఎంపీటీసీ సభ్యులు

నిర్మల్: సారంగపూర్ మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవిపై బీజేపీ ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్డీఓ రత్నకల్యాణి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభించిన గంటపాటు ఎంపీటీసీలు రాకపోవడంతో ఆర్డీఓ, ఇన్‌చార్జి ఎంపీడీఓ తిరుపతిరెడ్డి అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు. బలనిరూపణకు హాజరవాల్సిన ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. ఒక్క కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఇస్మాయిల్ మాత్రమే హాజరయ్యారు. మళ్లీ మండల ఉపాధ్యక్షురాలిగా (బీఆర్‌ఎస్ ఎంపీటీసీ) రాధనే కొనసాగనున్నారు.



అవిశ్వాసం వీగినట్లు సంతకం చేసి ప్రకటిస్తున్న ఆర్డీవో రత్నకల్యాణి

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

తానూరు: నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఈజీఎస్ ఏపీవో గంగాధర్ సూచించారు. సోమవారం మండలంలోని ఝరి(బి)తండాలో ఏర్పాటు చేసిన నర్సరీని ఆయన పరిశీలించారు. నిత్యం నర్సరీలో, ప్రకృతివనంలోని మొక్కలకు నీటిని అందించి ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టీఏ రమణగౌడ్, ఎఫ్ఏ ధన్‌సింగ్, వనసంరక్షణ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పెంబి: ఎండలు పెరుగుతున్నందున గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కల రక్షణకు గ్రీన్‌మ్యాట్లు ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు వేణునగర్‌లో నర్సరీలను ఎంపీవో రత్నాకర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మొక్కలు ఎండిపోకుండా సకాలంలో నీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పెంబిలో సెగ్రిగేషన్ షెడ్డు వద్ద ఎరువుల తయారీ ప్రక్రియ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



తానూరు: నర్సరీ పరిశీలిస్తున్న ఏపీవో గంగాధర్

రైతులు సంఘటితం కావాలి

లక్ష్మణచాంద: రైతులు సంఘటితమై రైతు ఉత్పత్తిదారుల సంఘాలు(ఎఫ్‌పీవో)గా ఏర్పడి తమ పంటలను అమ్ముకుంటే అధిక లాభాలు పొందవచ్చని ఏవో ఎం.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలోని రైతువేదికలో సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సేంద్రియ వ్యవసాయం, రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆవశ్యకతపై ఏవో పలు సూచనలు చేశారు. సేంద్రియ సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. సేంద్రియ వ్యవసాయంలో శిక్షణ, మార్కెటింగ్ మెలకువలు సీఎస్ఏ ద్వారా సహకారం అందిస్తామన్నారు. అనంతరం తాత్కాలికంగా సేంద్రియ సాగు రైతు కమిటీ కార్యవర్గం ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా డి.రాజారెడ్డి, కోశాధికారిగా కొప్పెల రాజేశ్వర్ ప్రధాన కార్యదర్శిగా సురకంటి రాజారెడ్డి, సభ్యులుగా సాయన్న, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, సాగర్, శ్రీధర్, సురేశ్‌రెడ్డి, శంకర్ సలహాదారులు డాక్టర్ రాజశేఖర్, రాజారెడ్డి, వెంకట్రాంరెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, లక్ష్మణచాంద, కొరిటికల్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు పరిశీలించిన డీఎస్పీ

నిర్మల్: సారంగపూర్ మండలంలోని చించోలి(బి) ఎక్స్‌రోడ్డు వద్ద ఆదిలాబాద్–నిర్మల్ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సోమవారం నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. ఈసందర్భంగా ఇప్పటివరకు చెక్‌పోస్టులో తనిఖీ చేసిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోకి మద్యం, డబ్బులు ప్రవేశించకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి


లోకేశ్వరం: పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. సోమవారం మండలంలోని రాయపూర్‌కాండ్లీ, ధర్మోర, పంచగుడి, వట్టోలి, బామ్నికే గ్రామాల్లో ఉపాధి పనులను ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పని ప్రదేశంలో టెంట్, తాగునీటి సౌకర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. కూలీలు ఉదయం 7 నుంచి 11 గంటల్లోపు పనులు పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఏపీవో జగన్నాథ్, టీఏలు మంజుల, రవీందర్, శారద ఉన్నారు.

బెల్లయ్యనాయక్‌కు సన్మానం

ఖానాపూర్: తెలంగాణ గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన తేజావత్ బెల్లయ్యనాయక్‌ను కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ సోమవారం సన్మానించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మ ర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేశారు. గిరిజనులను గుర్తించి పెద్దపీట వేసిన సీఎం రేవంత్‌రెడ్డికి గిరిజనుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

పటేల్ యూత్ గర్జన విజయవంతం చేయాలి

నిర్మల్‌టౌన్: కరీంనగర్‌లో ఈనెల 14న నిర్వహించే పటేల్ యూత్ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మారుతి ఇన్ హోటల్‌లో పటేల్ యూత్ గర్జన పోస్టర్, స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కరీంనగర్‌లోని బొమ్మ వెంకన్న విగ్రహం నుంచి భారీ ర్యాలీతో పటేల్ యూత్ ఫోర్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అయ్యన్నగారి భూమయ్య, ఎంసీ లింగన్న, శేఖర్, పాకాల రాంచందర్, లక్కాకుల నరహరి, గుమ్ముల అశోక్, రాజేందర్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్, నేతలు